RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక....



విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న మెదక్‌టుడే దినపత్రికలో విలేకరులుగా పనిచేయుటకు బ్యూరో, మండలలా , జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

మెదక్ టుడే తెలుగు దిన పత్రిక....

Call us now! 9494117870

30 ఏప్రిల్ 2026 మెదక్ పేజీలు : 4 వెల రూ : 2 ఎడిటర్ సిహెచ్ శివకుమార్ సంపుటి 02 సంచిక 128-

## రైతు కొనుగోళ్లపై సీఎం కు హరీశ్ రావు బహిరంగ లేఖ

- కాంగ్రెస్ హామీలపై తీవ్ర విమర్శలు
- వరి, శనగ, జొన్న రైతుల సమస్యల ప్రస్తావన
- వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్



**హైదరాబాద్,ఏప్రిల్,29,(మెదక్ టుడే న్యూస్)**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, రైతు డిక్లరేషన్ పూర్తిగా అమలులో విఫలమైందని తీవ్ర విమర్శలు గుప్పించారు. పంటల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం భారీగా చేరుతున్నప్పటికీ ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడం ఏంటని ప్రశ్నించారు. మిల్లుల వద్ద బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని అన్నారు. ఎండల తీవ్రతలో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనేప్రకటించాలని డిమాండ్ చేశారు.పొద్దుతిరుగుడు రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఇరవై రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉన్నప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్రం కొనుగోలు చేసిన పంట పరిమితంగానే ఉండగా, మిగిలిన లక్షకు

2

## ఉద్యోగాలపై స్పష్టమైన ప్రణాళిక కోరిన మాజీ ఎంపీ



**విశాఖపట్నం,ఏప్రిల్,29,(మెదక్ టుడే న్యూస్)**ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా కేంద్రం ఏర్పాటును స్వాగతించిన ఆయన, రాష్ట్ర యువతకు ఉపాధి కల్పన విషయంలో స్పష్టమైన హామీ అవసరమని సూచించారు. గూగుల్ కృత్రిమ మేధస్సు డేటా కేంద్రానికి శంకుస్థాపన జరిగిన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రసంగంపై ఆయన స్పందిస్తూ, ఇలాంటి వేదికలపై రాజకీయ వ్యాఖ్యలు చేయడం కంటే ఉపాధి అవకాశాలపై స్పష్టమైన ప్రణాళిక ప్రకటించడం మంచిదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర యువతకు ఎన్ని ఉద్యోగాలు, ఏయే రంగాల్లో, ఎంతకాలంలో లభిస్తాయో వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రస్తుతం సమాచార సాంకేతిక రంగంలో ఉద్యోగాల కోతలు జరుగుతున్న నేపథ్యంలో, ఉపాధిపై ప్రభుత్వ భరోసా మరింత కీలకమని విజయసాయిరెడ్డి చెప్పారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెట్టుబడుల ఒప్పందాలు ఉండాలని ఆయన సూచించారు. సంస్థలకు ప్రభుత్వం తక్కువ ధరలకు భూములు కేటాయించడం పట్ల తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే ఆ రాయితీలు రాష్ట్ర ప్రజలకు నిరంతరం ఉపాధి కల్పించేలా ఉండాలని షరతు పెట్టారు. అప్పుడే ఆ ఒప్పందాలు

2

## ఇరాన్ రాయబార కార్యాలయం పోస్టుపై వివాదం

- ఆత్మబలిదాన పిలుపుపై తీవ్ర విమర్శలు
- యూకే ప్రభుత్వ ఆగ్రహండ రాయబారికి సమన్లు
- పోస్టును సమర్థించుకున్న ఇరాన్

**లండన్,ఏప్రిల్,29,(మెదక్ టుడే న్యూస్)**యునైటెడ్ కింగ్డమ్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం చేసిన ఒక సామాజిక మాధ్యమ పోస్టు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. యూకేలో నివసిస్తున్న ఇరానీయులను ఉద్దేశించి దేశం కోసం



ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉండాలని చేసిన పిలుపు వివాదానికి దారితీసింది. ఆ పోస్టులో అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో శత్రువులకు తలొంచవద్దని, అవసరమైతే దేశం కోసం ప్రాణాలను అర్పించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా, అలాంటి వారంతా తమను సంప్రదించాలని కోరడం మరింత వివాదాస్పదమైంది.ఈపోస్టుపై వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రజలను రెచ్చగొట్టేలా, ఆందోళన కలిగించేలా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విదేశాల్లో నివసిస్తున్న పౌరులకు ఇలాంటి పిలుపులు

2

## పదో తరగతి సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

- జూన్ 5 నుంచి అదనపు పరీక్షలు
- రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ వివరాలు వెల్లడి
- ఫీజు చెల్లింపుకు మే 14 వరకు అవకాశం

**హైదరాబాద్,ఏప్రిల్,29,(మెదక్ టుడే న్యూస్)** తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలైన నేపథ్యంలో, ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌తో పాటు రీకౌంటింగ్,



రీవెరిఫికేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించింది.అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభమై జూన్ 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరుకావాలనుకునే విద్యార్థులు ఏప్రిల్ 30 నుంచి మే 14వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు.

2

## మంత్రి పదవిపై స్పష్టత

- నామినేటెడ్ పోస్టులపై ఆశలు కోదండరాం
- మంత్రి పదవి అడగలేదని వ్యాఖ్య
- ప్రభుత్వంలో భాగస్వామ్యం
- కోరుతున్నట్టువెల్లడికేసీఆర్ పాలనపై విమర్శలు

హైదరాబాద్,ఏప్రిల్,29, (మెదక్ టుడే న్యూస్)తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చెప్పలేదని, తాను కూడా అలాంటి అభ్యర్థన చేయలేదని తెలంగాణ జన



సమితి అధినేత కోదండరాం స్పష్టం చేశారు. అయితే తన పార్టీకి చెందిన నాయకులకు త్వరలోనే నామినేటెడ్ పోస్టులు లభిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని తమ ఆకాంక్షను బహిరంగంగానే వ్యక్తం చేసిన ఆయన, రాజకీయంగా తాము సముచిత స్థానం కోరుకుంటున్నామని చెప్పారు. తమ పార్టీకి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై కోదండరాం తీవ్ర విమర్శలు చేశారు. ఆ సమయంలో ప్రజలు, నాయకులు ఒక రకమైన

2

## పేదల గృహ కల సాకారం

**నల్గొండ,ఏప్రిల్,29,(మెదక్ టుడే న్యూస్)**నల్గొండలోని శ్రీనివాస కాలనీలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ



సందర్భంగా పేదల సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. నల్గొండ చుట్టుపక్కల సుమారు 50 ఎకరాల భూమిని సేకరించి అత్యాధునిక వసతులతో ఇందిరమ్మ కాలనీలను నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. పేదలకు నివాస సౌకర్యాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లాకు త్వరలోనే మరో 10వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ పేదల గృహ నిర్మాణానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని మంత్రి

2

## ఏపీలో విభిన్న వాతావరణం

**అమరావతి,ఏప్రిల్,29(మెదక్ టుడే న్యూస్)**ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం విభిన్నంగా మారింది. ఒకవైపు తీవ్ర



ఎండలు మండిపోతుండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం రేపు విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లోని సుమారు 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉంది. అదేవిధంగా మరో 20 మండలాల్లో సాధారణ వడగాల్పులు ఉండనున్నట్లు హెచ్చరికలు జారీ చేశారు. ఇక కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితుల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇవాళ నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇతర ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడగాల్పుల ప్రభావం నుంచి రక్షణ కోసం మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా ఉండాలని, తగినంత నీరు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వర్షాల సమయంలో మెరుపుల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. మొత్తానికి రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటం అవసరమని అధికారులు సూచిస్తున్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన కొత్త డీజీపీ

- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశం
- అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి
- భద్రతా వ్యవస్థపై చర్చ

**హైదరాబాద్,ఏప్రిల్,29,(మెదక్ టుడే న్యూస్)**రాష్ట్ర కొత్త డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ హైదరాబాద్‌లోని సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సీవీ ఆనంద్‌కు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించినట్లు సమాచారం.పోలీసు వ్యవస్థ పనితీరు, భద్రతా ఏర్పాట్లు, ఆధునిక సాంకేతిక వినియోగంపై ఇరువురి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. సీవీ ఆనంద్ కూడా తన



బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ భేటీతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో కొత్త దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల భద్రతను కాపాడే దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## సరస్వతీ అంత్య పుష్కరాలపై మంత్రులు సమీక్ష

- ఏర్పాట్లు వేగవంతం
- కాళేశ్వరంలో మే 21 నుంచి పుష్కరాలు
- కొండా సురేఖ, శ్రీధర్ బాబు సమీక్ష సమావేశం
- భక్తులకు పూర్తి సౌకర్యాలపై దృష్టి

హైదరాబాద్,ఏప్రిల్,29, (మెదక్ టుడే న్యూస్) రాష్ట్రంలో జరగనున్న సరస్వతీ అంత్య పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పుష్కరాల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులు వివరించారు.మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో 12 రోజుల పాటు పుష్కరాలు నిర్వహించనున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పుష్కరాల సందర్భంగా రూ.30.63 కోట్ల వ్యయంతో 162 అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఘాట్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్ వంటి వసతులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో పుష్కర స్నానం చేసి స్వామివారి దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని మంత్రులు స్పష్టం చేశారు. భద్రత, రవాణా, వైద్య సేవలను సమర్థంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు.ఈసందర్భంగా పుష్కరాల అధికారిక పోస్టర్, టీజర్‌ను మంత్రులు ఆవిష్కరించారు.




భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని ఆదేశించారు.మొత్తానికి సరస్వతీ అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందని మంత్రులు తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన, భద్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయి.

మెదక్ టుడే
RNI NO: TELTEL/2023/88524
తెలుగు దిన పత్రిక....

# జనరల్ న్యూస్



## రైతు కొనుగోళ్లపై సీఎం కు హరీశ్ రావు బహిరంగ లేఖ

మొదటిపేజీ తరువాయి పైగా క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనగ రైతుల సమస్యలపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధర ఉన్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్మాల్సి వస్తోందని తెలిపారు. ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మాల్సిన పరిస్థితి నివారించాలని కోరారు. అలాగే మొక్కజొన్న కొనుగోలు నిబంధనలను సడలించాలని సూచించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## ఉద్యోగాలపై స్పష్టమైన ప్రణాళిక కోరిన మాజీ ఎంపీ

మొదటిపేజీ తరువాయి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇటీవల అనకాపల్లిలో ఉక్కు కర్మాగారం, విశాఖలో గూగుల్ డేటా కేంద్రానికి శంకుస్థాపనలు జరిగిన విషయం తెలిసిందే. పెట్టుబడులను ఆకర్షించేందుకు పలు సంస్థలకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ముందుకు సాగుతోంది. ఇటీవల తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి రాజకీయాలకు విరామం ప్రకటించినప్పటికీ, త్వరలోనే మళ్లీ రాజకీయాల్లోకి రావాలని సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ చురుగ్గా వ్యవహరిస్తున్నారు.

## ఇరాన్ రాయబార కార్యాలయం పోస్టుపై వివాదం

మొదటిపేజీ తరువాయి ఇవ్వడం సరైంది కాదని వ్యాఖ్యలు వినిపించాయి. ఈ పరిణామంపై యూకే ప్రభుత్వం కూడా తీవ్రంగా స్పందించింది. ఇరాన్ రాయబారి సయ్యద్ అలీ మౌసావినికి సమన్లు జారీ చేసి వివరణ కోరింది. ఇలాంటి పోస్టులు దౌత్య పరంగా అనుచితమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ విమర్శలను ఇరాన్ రాయబార కార్యాలయం ఖండించింది. తమ పోస్టు దేశభక్తి,



విధేయతకు సంబంధించినదని, హింసను ప్రోత్సహించే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు తమ మాతృభూమి రక్షణలో ముందుంటారని తెలిపింది. ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కూడా దేశ రక్షణ కోసం అవసరమైతే ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉండాలని పౌరులకు పిలుపునిచ్చిన విషయం ప్రస్తావనలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పోస్టు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది.

# మంత్రి పదవిపై స్పష్టత

మొదటిపేజీ తరువాయి

భయాందోళనలో జీవించారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, జాగ్రత్తగా మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రజల నుంచి దూరమయ్యారని, అందుకే ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన నాయకత్వం తిరిగి నమ్మకం పొందడం కష్టం అని వ్యాఖ్యానించారు. ఇక కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై స్పందిస్తూ, ఆమె వ్యాఖ్యల ద్వారా కుటుంబ రాజకీయాల అంతర్గత అంశాలు బయటపడుతున్నాయని విమర్శించారు. పార్టీ అంటే ఒక కుటుంబమే అన్న భావన ఆమె చర్యల్లో కనిపిస్తోందని అన్నారు. తమ పార్టీ ఎన్నికల కోసమే కాకుండా మార్పు కోసం పని చేస్తుందని కోదండరాం స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని, ముందుగానే నియోజకవర్గాలను ఎంపిక చేసుకుని వ్యూహాత్మకంగా ముందుకు సాగుతామని ప్రకటించారు.

## పదో తరగతి సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇకఫలితాలపై సందేహాలు ఉన్న విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. మార్కుల లెక్కింపులో లోపాలుంటే సరిచేసుకునేందుకు ఈ అవకాశం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రీకౌంటింగ్ కోసం ఒక సబ్జెక్టుకు రూ. 500 ఫీజు ఉండగా, రీవెరిఫికేషన్ కోసం ఒక సబ్జెక్టుకు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు తమ అవసరాన్ని బట్టి ఈ సేవలను



వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈనిర్ణయంతో ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం లభించినట్లయింది. సమయానికి ఫీజు చెల్లించి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని అధికారులు సూచించారు.

# పేదల గృహ కల సాకారం

మొదటిపేజీ తరువాయి హామీ ఇచ్చారు. గతంలో కేటాయించిన 8 ఎకరాల భూమిని జర్నలిస్టులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందే వరకు తమ కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజా పాలనలో పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న గృహ పథకాలపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారు.

## వ్యాపారవేత్త బండారి రమేష్ ఆధ్వర్యంలో

### మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌కు ఘన సన్మానం

(స్పెషల్ కరస్పాండెంట్)
షాద్‌నగర్,రంగారెడ్డి జిల్లా,
ఏప్రిల్,29,మెదక్ టుడే న్యూస్

షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన అగ్గనూర్ బసవేశ్వర్‌కు బసవ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం షాద్‌నగర్‌లోని వాసవి చిట్ ఫండ్ కార్యాలయంలో సన్మానంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త బండారి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే బండారి రమేష్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సేవలను ప్రశంసిస్తూ, ఆయన నాయకత్వంలో షాద్‌నగర్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు కల్వ మల్లికార్జునప్ప ఆధ్వర్యంలో అగ్గనూర్



బసవేశ్వర్‌కు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం బసవ కృప రజోత్సవ ప్రత్యేక సంచికను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌కు ప్రముఖ వ్యాపారవేత్త బండారి రమేష్ చేతుల మీదుగా అందజేశారు. బండారి రమేష్ మాట్లాడుతూ, సమాజంలో బసవ తత్వాలను విస్తృతంగా ప్రచారం చేయడం అత్యంత అవసరమని, అలాంటి కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ మద్దతు ఇస్తానని తెలిపారు. అలాగే, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ చైర్మన్ ముందుండి పని చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, తనపై చూపిన గౌరవానికి కృతజ్ఞతలు తెలియజేసి, ప్రజల ఆశలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బసవ సంక్షేమ సమితి సభ్యులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పక్కగా జనగణన జరగాలి

### సజావుగా ధాన్యం కొనుగోలు- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్,ఏప్రిల్,29,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి,పక్కాగా జనగణన జరగాలని,ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ సిబ్బందికి సూచించారు. బుధవారం నిజాంపేట మండల



కేంద్రంలో జనగణన తీరును డోర్ టు డోర్ తిరిగి పరిశీలించారు. అనంతరం ఫ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ,జనగణను పూర్తిస్థాయిలో నిర్వహించి ప్రజల నుంచి పూర్తి సమాచారాన్ని రాబట్టాలని, జనగణనలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఫ్యాక్స్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి తూకం ప్రక్రియను పరిశీలించారు. సరిగా తూకం వేయాలని, సజావుగా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వి ఓ ఏ లకు నీరు, పారిశుధ్యం పరిశుభ్రత పై

## ఒకరోజు శిక్షణా కార్యక్రమం

చేగుంట,ఏప్రిల్,29,మెదక్ టుడే న్యూస్:మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయి సిబ్బంది అయిన ' విలేజ్ ఆర్గనైజషన్ అసిస్టెంట్స్ ' ఓబీ ల




కోసం నీరు, పారిశుధ్యం మరియు పరిశుభ్రత అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణలో సురక్షిత తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి, మరుగుదొడ్ల వినియోగం, ఇంటి పరిసరాల పరిశుభ్రత ఘన వ్యర్థాల నిర్వహణ వంటి ముఖ్య అంశాలపై విపులంగా చర్చ జరిగింది. మహిళా అభివృద్ధి సంస్థ తరపున వాష్ తెలంగాణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బ్రహ్మచారి పాల్గొని, సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల ప్రాముఖ్యతపై వివరించారు. మంచి నీటి మూలాల వినియోగం, చేతులు కడుక్కోవడం యొక్క ప్రాముఖ్యత, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలో సూచనలు అందించారు. అప్మాస్ సంస్థ ద్వారా ఆర్వో వాటర్ ప్లాంట్ మహిళా సభ్యులు పెట్టుకుంటే రెండు లక్షల రూపాయలు సబ్సిడీ మరియు కమ్యూనిటీ బోర్ వెల్ వేసుకున్నా వారికి 25 వేల రూపాయలు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రీమతి అనిత మాట్లాడుతూ



గ్రామాల్లో శుభ్రతపై అవగాహన పెంపొందించడం వి ఓ ఏ స్ యొక్క ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి కుటుంబానికి సమయానికి సరైన సమాచారం అందించడంతో పాటు, ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా, ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో అమలు చేయాలని సంఘాల ద్వారా ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని అప్మాస్ ప్రతినిధులు సూచించారు. ఏపీఎం శ్రీ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంఘ సమావేశంలో వాష్ అంశాన్ని ఒక ముఖ్య అజెండాగా చేర్చి, ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వి ఓ ఏ ఎస్ ఈ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ, ఈ అంశాలను గ్రామస్థాయిలో అమలు చేసి కుటుంబాల ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు కృషి చేస్తామని తెలిపారు. శిక్షణను నిర్వహించిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో (సీసీలు), మండల సమాఖ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోరక్షణ చట్టబద్ధంగా ఉండాలి: ఏసిపి శ్రీనివాస్ కుమార్

### - చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

రామచంద్రాపురం,ఏప్రిల్,29,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి, గోసంరక్షణ పేరుతో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని రామచంద్రాపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో గోరక్షక దళ సభ్యులు మరియు స్థానిక పోలీస్ అధికారులతో ఆయన శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిఏసిపి శ్రీనివాస్ కుమార్లి మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు. చట్టంపై గౌరవం: బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమంగా గోవులను తరలించే వారిపై ఇప్పటికే నిఘా ఉంచామని, అక్రమ రవాణాను గుర్తిస్తే కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. అయితే, గోరక్షక సభ్యులు వాహనాల డ్రైవర్లపై దాడులు చేయడం, చట్టాన్ని అతిక్రమించడంసరికాదనిహెచ్చరించారు. పోలీసులకు సమాచారం: గోవుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అంతేకానీ స్వయంగా దాడులకు



పాల్పడకూడదని సూచించారు. అవగాహన కార్యక్రమాలు: గోవంశ సంరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, దీని కోసం గ్రామ స్థాయిలో పశు పోషకులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు కార్డులు: నిబంధనల ప్రకారం గోరక్షణ చేసే వారికి తగిన గుర్తింపు ఇచ్చేలా కృషి చేస్తామని ఏసిపి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి గోశాల అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సుకుదేవ్ జోషి లతో పాటు పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, బొల్లారం, చందానగర్ ఇన్‌స్పెక్టర్లు వినాయక్ రెడ్డి, జగన్నాథ్, నరేష్, రవీందర్ రెడ్డి, విజయ్ మరియు ఎస్.ఐ లు విజయ్ కుమార్, రామాంజనేయులు, పెద్ద సంఖ్యలో గోరక్షక దళ సభ్యులు పాల్గొన్నారు.